సాక్షి
నంద్యాల

గురువారం, 1, మే, 2025



బంగారు దుకాణంలో చోరీ
పత్తికొండలోని బంగారు దుకాణంలో చోరీ జరిగింది. 8 జతల బంగారు కమ్మలు, ఒకటిన్నర కేజీల వెండి ఆభరణాలు, రూ.3 లక్షలను అపహరించినట్లు బాధితుడు తెలిపారు. 8లో▸



సెంటిమెంట్ పండింది
అక్షయ తృతీయను పురస్కరించుకుని బుధవారం బంగారం దుకాణాలు కిటకిటలాడాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.250 కోట్ల వ్యాపారం జరిగి ఉండొచ్చని అంచనా. 8లో▸



అధికారులు ఈ వంక చూడరు?
డోన్ పట్టణ నడిబొడ్డున వంకను కొందరు టీడీపీ నాయకులు పూడ్చివేస్తున్నారు. రేకుల షెడ్డును నిర్మించి మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్‌ను కూడా పొందారు. 8లో▸

న్యూస్‌రీల్

కంచి పీఠాధిపతికి మహానందీశుని ప్రసాదాలు



శ్రీ విజయేంద్ర సరస్వతీస్వామికి జ్ఞాపిక, ప్రసాదాలు అందిస్తున్న ఈఓ, వేదపండితులు

మహానంది: కంచి కామకోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠంలో పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి, 71వ పీఠాధిపతిగా శిష్య స్వీకారం చేసిన సత్యచంద్రశేఖరేంద్రసరస్వతి స్వామికి బుధవారం మహానందీశ్వరుడి ప్రసాదాలు అందించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఆలయ వేదపండితులు చెండూరి రవిశంకర అవధాని, ఏఈఓ ఎరమల మధు వెళ్లి శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వారి ప్రసాదాలు అందించారు.

వైభవంగా అక్షయ తృతీయ వేడుక



రాఘవేంద్రస్వామి సేవలో పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో పవిత్ర అక్షయ తృతీయ వేడుక వైభవంగా నిర్వహించారు. బుధవారం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు నేతృత్వంలో వేడుకలు శాస్త్రోక్తంగా చేపట్టారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి గంధ లేపనం గావించి విశేష పూజలు కానిచ్చారు. రెండు గంటల పాటు వేద మంత్రోచ్చారణలతో పూజోత్సవాలు నిర్వహించారు. వేడుక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అక్షయ తృతీయ కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి సేవలో తరించారు.

పాలిసెట్‌కు 562 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని 22 పరీక్ష కేంద్రాల్లో పాలిసెట్‌ను బుధవారం నిర్వహించగా 562 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 5,682 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 3,784 మంది బాలురు, 1,898 మంది బాలికలు ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న బాలురుల్లో 3466 మంది, బాలికల్లో 1,654 మంది పరీక్షకు హాజరైనట్లు నంద్యాల జిల్లా పాలిటెక్నిక్ జిల్లా కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు.

రుద్రవరంలో బాల్య వివాహం

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరం బెస్త కాలనీకి చెందిన ఓ యువకుడికి ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామానికి చెందిన బాలికకు బుధవారం గ్రామ సమీపాన ఉన్న ఆలయం వద్ద వివాహం చేశారు. బాలిక పెళ్లి విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ సీడీపీఓ తేజశ్వరి అక్కడికి చేరుకొని విచారించారు. వధూవరులతో పాటు పెద్దలను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అక్కడ ఆమె ఫిర్యాదు ఇవ్వగా వధూవరుల కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాదు తెలిపారు.

నిర్మాణాలు త్వరగా పూర్తయితే బిల్లులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శ్రీహరి గోపాల్

సంజామల: గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకుంటే బిల్లులు అందుతాయని లబ్ధిదారులకు జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీహరి గోపాల్ తెలిపారు. మండల పరిధిలోని ఆర్.లింగందిన్నె, పేరుసోముల, రామిరెడ్డిపల్లె గ్రామాల్లో ఉన్న హౌసింగ్ కాలనీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి అదనంగా వచ్చే బిల్లులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే 30లోపు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకి అడిషినల్ పేమెంట్ వర్తిస్తుందని తెలిపారు. నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాల కోసం బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు,ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్స్, ఇంజినీర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కన్నీటికి.. కరగని పింఛను

బంధువుల ఆదరణ కరువై.. కనిపెంచిన కుమారులు, కుమార్తెల ప్రేమకు దూరమై.. కంటికి రెప్పలా చూస్తున్న భర్తను కోల్పోయి.. పింఛన్ కోసం ఎదురు చూసే మహిళలకు శోకమే మిగులుతోంది. బతుకు దుర్భరంగా మారిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడం లేదు. 'స్పౌజ్' అంటూ సరికొత్త విధానం తీసుకొచ్చింది. భర్త మృతిచెందడంతో ఆసరా కోసం దరఖాస్తు ఇచ్చిన మహిళలకు వితంతు పింఛన్లు ఇవ్వకుండా హైడ్రామా చేస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. కొత్త పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



- 'స్పౌజ్' పేరుతో సరికొత్త విధానం
- ఇప్పటి వరకు అర్హులైన వితంతువులకు అందని పింఛన్
- కొత్త విధానం తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- పింఛన్ పొందే భర్త చనిపోతేనే అర్హతంటూ ప్రచారం
- దరఖాస్తులకు ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): వితంతు పింఛన్ అర్థాన్నే రాష్ట్ర ప్రభుత్వం మార్చేసింది. భర్త చనిపోయిన వెంటనే మహిళలకు పింఛన్ ఇవ్వాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్న అనంతరం ఆసరా కల్పించాలి. నిబంధనల మేరకు వితంతు పింఛన్ ఇచ్చి మహిళల జీవితంలో వెలుగులు నింపాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు నూతన వితంతు పింఛన్లు ఇవ్వలేదు. ఇప్పుడు కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. స్పౌజ్ కేటగిరీలో వితంతు పింఛన్లు మంజూరు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఏదైనా కేటగిరీలో పింఛన్ పొందుతున్న భర్త మృతి చెందితే, అతని భార్యకు మాత్రమే పింఛన్ మంజూరు చేసేలా నిబంధనలు విధించింది.

ఇదీ దుస్థితి

పింఛన్ల కోసం అర్హులు దరఖాస్తు చేసుకున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా స్పౌజ్ కేటగిరీ పేరుతో వితంతు పింఛన్ల మంజూరంటూ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇక్కడ ఓ మెలిక పెట్టింది. ఏదైనా కేటగిరిలో పింఛన్ పొందుతూ భర్త మృతిచెందితే భార్యకు స్పౌజ్ కేటగిరీ పేరుతో పింఛన్ మంజూరు చేయాలని నిర్ణయించింది. అది కూడా నిర్దిష్ట కాలమేనని స్పష్టం చేసింది. ఎవరైనా పింఛన్ పొందుతూ డిసెంబర్ 2023 నుంచి అక్టోబర్ 2024 మధ్య చనిపోతే అతని భార్యను స్పౌజ్ కేటగిరీ కింద అర్హురాలిగా గుర్తిస్తారు. అక్టోబర్ తర్వాత భర్త మరణించిన మహిళకు పింఛన్ లేనట్లే. ఇది కూటమి ప్రభుత్వం వితంతు పింఛన్లకు విధించిన షరతు.

దరఖాస్తులు వస్తాయా?

నంద్యాల జిల్లాలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి సామాజిక పింఛన్లు మొత్తం 2,22,477 ఉన్నాయి. ఈ నెల ఒకటో తేదీ నాటికి 2,14,590 మాత్రమే ఉన్నాయి. మరణాలు, ఇతర కారణాలతో 7,887 పెన్షన్లు ఆగిపోయాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. సంక్షేమ పథకాలను అర్హుల ఇళ్లకే డోర్ డెలివరీ చేసింది. 50 ఇళ్లకో వలంటీర్‌ను నియమించి ఆయా కుటుంబాల్లో అర్హత ఉన్న వారిని పథకాలు దరఖాస్తు చేయించేవాళ్లు. 35 ఏళ్ల వయసు పైబడిన మహిళలకు భర్త చనిపోతే మరుసటి నెలలోనే వితంతు పింఛన్ అందించేవారు.

ప్రస్తుతం స్పౌజ్ కేటగిరీ కింద డిసెంబర్ ఒకటి 2023 నుంచి 31 అక్టోబర్ 2024 మధ్య 3,169 మంది పింఛన్ లబ్ధిదారులు చనిపోయారని, వారి భార్యలు స్పౌజ్ కేటగిరీ కింద సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. వీరిలో ఎంత మంది బతికి ఉన్నారో దరఖాస్తులు వస్తేగానీ తెలియదు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 50 ఏళ్లు నిండిన వారు పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. వారి నుంచి ప్రభుత్వం కనీసం దరఖాస్తులు కూడా తీసుకోవడం లేదు.

ప్రస్తుత విధానం ఇదీ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సామాజిక పింఛన్ మంజూరు కాలేదు. పది నెలలుగా పట్టించుకో లేదు. నూతనంగా స్పౌజ్ కేటగిరీ పేరుతో వితంతువులకు పింఛన్లు ఇస్తామని చెబుతోంది. పింఛన్ల కోసం ప్రతి వారం భర్తలను కోల్పోయిన మహిళలు కలెక్టరేట్ వద్ద క్యూ కడుతున్నారు. అయితే ప్రభుత్వం తీసుకున్న నూతన నిర్ణయంతో వీరికి పింఛన్ వస్తుందో రాదో చెప్పలేదని దుస్థితి నెలకొంది.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏం జరిగిందంటే..

- ➤ భర్తలు మృతి చెందినా నంద్యాల మండలంలోని అయ్యలూరు గ్రామంలో లక్ష్మి, అప్పయ్యమ్మ, రమణమ్మలకు వితంతు పింఛన్ రాలేదు.
- ➤ కోవెలకుంట్లలో బాలమద్దమ్మ భర్త వాసగిరి పెద్ద సుబ్బరాయుడుకు ప్రతి నెలా వృద్ధాప్య పింఛన్ అందేది. అయితే ఈయన 2023 మే నెలలో అనారోగ్యంతో మృతి చెందాడు. వితంతు పింఛన్ కోసం బాలమద్దమ్మ దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకు అందలేదు.
- ➤ భర్త మృతి చెందినా స్పౌజ్ కింద భార్యకు పింఛన్ ఇవ్వనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన పాలుట్ల కాంతమ్మ ఆనందం వ్యక్తం చేశారు. అయితే కాంతమ్మ భర్త పాలుట్ల ఓబన్న 2023 నవంబర్ 9న మృతిచెందడంతో ఆమె అనర్హురాలిగా మిగిలిపోయారు.
- ➤ ఉయ్యాలవాడ మండలం ఆర్. జంబులదిన్నెకు చెందిన నాగమ్మ(82) భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఈమెకు సంతానం లేకపోవడంతో ఒంటరిగా నివసిస్తోంది. వృద్ధాప్యం మీద పడటం, ఆరోగ్యం సహకరించకపోవడంతో కనీసం వంట చేసుకునే స్థితిలో కూడా లేదు. పింఛన్‌పై సందేహాలు ఉండటంతో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డారు.
- ➤ రుద్రవరం గ్రామంలో లక్ష్మీదేవి(45) అనే వితంతువుకు గత కొన్నేళ్ల నుంచి పింఛన్ అందుతోంది. అయితే ఇంటి పన్ను బకాయి ఉందని అధికారులు పింఛన్ సొమ్ము ఇవ్వకపోవడంతో ఆమె వైద్యం చేయించుకోలేక అనారోగ్యంతో మృతి చెందింది.

అంతా సర్దుబాటే



కూటమి ప్రభుత్వం కొత్తగా పింఛన్లు ఇచ్చిందేమీ లేదు. ఉన్న వాటినే సర్దుబాటు చేస్తోంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్లు నిండిన వారందరికీ పింఛన్లు ఇవ్వాలి. ఇప్పటికే భర్తలను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారందరికీ వితంతు పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలి. స్పౌజ్ కేటగిరీ దరఖాస్తులతో పాటే వారికి దరఖాస్తులు తీసుకొని పింఛన్లు మంజూరు చేయాలి.

– రంగనాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి, నంద్యాల

దరఖాస్తు చేసుకోవాలి



జిల్లాలో ప్రస్తుతం స్పౌజ్ కేటగిరి కింద 2023 డిసెంబర్ 21 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య 3,159 మంది పింఛన్‌దారులు చనిపోయారు. వారి భార్యలు స్పౌజ్ కేటగిరి కింద సచివాలయంలో ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలి.

– శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

లంచం అడిగితే సమాచారమివ్వండి

- టోల్‌ఫ్రీ నెంబర్ 1064
- ఏసీబీ నూతన డీఎస్పీ దివిటి సోమన్న



బాధ్యతలు చేపడుతున్న ఏసీబీ డీఎస్పీ సోమన్న

కర్నూలు: ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే (లంచం అడిగితే) టోల్‌ఫ్రీ నెంబర్ 1064కి కాల్ చేసి సమాచారం అందించాలని అవినీతి నిరోధక శాఖ కర్నూలు రేంజ్ డీఎస్పీ దివిటి సోమన్న ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దాదాపు 11 నెలల కాలంగా ఏసీబీ డీఎస్పీ పోస్టు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వం ఇటీవల సోమన్నను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం కలెక్టరేట్ వెనక ఎ.క్యాంప్‌లో ఉన్న ఏసీబీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా కనగానపల్లె మండలం వేపకుంట గ్రామానికి చెందిన సోమన్న 1991లో ఎస్ఐ హోదాలో పోలీసు శాఖలో చేరారు. క్రిష్ణగిరి, సంజామల, నందవరం, వెల్దుర్తి, అనంతపురం పీటీసీలో విధులు నిర్వహించారు. సీఐగా పదోన్నతి పొందిన తర్వాత సీఐడీ, ప్యాపిలి, ఆదోని తాలూకా, లక్కిరెడ్డిపల్లె పీఎస్‌లో పనిచేశారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొంది సీఐడీ, ఆదోని డీఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం అమరావతి హెడ్ క్వార్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సోమన్నను కర్నూలు రేంజ్ ఏసీబీ విభాగానికి నియమించడంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. అవినీతి అధికారుల సమాచారం తన ఫోన్ నెంబర్ 9440446178కు కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో టైమ్ స్లాట్ బుకింగ్

కర్నూలు(సెంట్రల్): ఉమ్మడి జిల్లాలోని 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బుధవారం నుంచి టైమ్‌స్లాట్ బుకింగ్ ప్రారంభమైంది. క్రయవిక్రయదారులు తమకు అనుకూలమైన సమయంలో స్లాట్‌ను బుక్ చేసుకుని వెళ్లి రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి వీలుంటుంది. కాగా పైలెట్ ప్రాజెక్టుగా ఏప్రిల్ 4వ తేదీ నుంచి నంద్యాల, కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో టైమ్ స్లాట్ బుకింగ్‌లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ క్రమంలో మిగిలిన అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా టైమ్ స్లాట్ బుకింగ్ విధానం బుధవారం నుంచి అమలులోకి వచ్చింది. కాగా 2020 నుంచే టైమ్‌స్లాట్ బుకింగ్ విధానం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలులో ఉంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిని మరోసారి మొదటిసారి ప్రారంభిస్తున్నట్లు చెప్పి ప్రచారం చేసుకోవడం గమనార్హం.

'చౌక'బారు దోపిడీ

- పేదలకు అందని రేషన్ సరుకులు

నంద్యాల(అర్బన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ సరుకులకు కోత పడుతోంది. పేదలకు నిత్యావసర సరుకులు అందడం లేదు. మార్కెట్‌లో కందిపప్పుకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో సబ్సిడీపై అందించే కందిపప్పును పూర్తి స్థాయిలో కోత పెడుతూ కార్డుదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. జిల్లాలో సుమారు 5.41లక్షల కార్డుదారులకు 1,204 రేషన్ షాపులు, 351 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు అందిస్తున్నారు. అయితే జిల్లాలో మే నెలకు సంబంధించి బియ్యం 7373.381 మెట్రిక్ టన్నులు, కందిపప్పు 531.729 మెట్రిక్ టన్నులు పంపిణీ కావాల్సి ఉంది. కంది పప్పు మాత్రం మూడు నెలలుగా రేషన్ షాపుల్లో కనిపించడం లేదు. జిల్లాలో చక్కెర కొంత మంది కార్డుదారులకు మాత్రమే అందింది. సబ్సిడీపై అందించే చక్కెరకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. గతంలో ఎన్నడూ లేని తరహాలో ప్రస్తుతం చిత్ర మైన పరిస్థితి అక్కడక్కడ కనిపిస్తోంది.

బియ్యాన్ని విక్రయించి..

వాస్తవానికి ప్రతి రేషన్ డీలరు సుమారు 30 శాతం వరకు బియ్యాన్ని మిగుల్చుకుంటారు. 100 క్వింటాళ్ల రేషన్ బియ్యం కేటాయిస్తే అందులో 70 శాతం మాత్రమే పంపిణీ చేస్తారు. 10 నుంచి 15శాతం మంది కార్డుదారులకు బియ్యం అయి పోయాయంటూ నగదు ఇచ్చి వేలి ముద్ర వేయించుకుంటారు. ఆ బియ్యాన్ని కేజీ రూ.25 నుంచి రూ.30 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం.



ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ట్రాక్టర్లలో తరలిస్తున్న రేషన్ సరుకులు

భానుడి భగభగలు

కర్నూలు (అగ్రికల్చర్): భానుడి భగభగలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రాష్ట్రంలోనే నంద్యాల జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పాణ్యం, దొర్నిపాడులో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బండి ఆత్మకూరులో 42.5, రుద్రవరం, మహానంది, ఆత్మకూరు, గడివేములలో 42.1, ఆళ్లగడ్డ 42.2 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేశాయి. కర్నూలు జిల్లాలో అత్యధికంగా కర్నూలు అర్బన్‌లో 41.8, కోడుమూరులో 41.6 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముంది.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆవిర్భావం

- గ్రామీణ బ్యాంకులన్నీ ఏపీజీబీలో విలీనం

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్రంలోని గ్రామీణ బ్యాంకులన్నీ ఒకే గొడుగు కిందకు వచ్చాయి. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ)గా మార్పు చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. గ్రామీణ బ్యాంకులన్నీ మే నెల 1 నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కింద పని చేస్తాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు 1,384 శాఖలతో పెద్ద బ్యాంకుగా అవతరించింది. ఇప్పటివరకు గ్రామీణ బ్యాంకులకు కెనరా బ్యాంకు స్పాన్సర్డ్ బ్యాంకుగా ఉంది. ఇక నుంచి స్పాన్సర్స్ బ్యాంకుగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యుబిఐ) ఉండనుంది. ప్రస్తుతానికి ఖాతా నెంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు యథాతథంగా ఉంటాయని బ్యాంకు వర్గాలు తెలిపాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం అమరావతిలోనే ఉండనుంది.

బసవేశ్వరుడు విశ్వగురువు

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



జిల్లా కలెక్టర్‌ను సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న వీరశైవ సంఘం నాయకులు

గోస్పాడు: మహాత్మా బసవేశ్వరుడు 64 లక్షలకు పైగా ప్రవచనాలు రాసి విశ్వగురువుగా ఖ్యాతి పొందారని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. మహాత్ముని బోధనలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం బసవేశ్వరుడి జయంతి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి, డీఆర్‌ఓ రాము నాయక్, జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణమూర్తి, వీరశైవ సంఘం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా విభజన తర్వాత తొలిసారి బసవేశ్వరుడి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. బసవేశ్వరుడు.. 12వ శతాబ్దంలో వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించారని, అన్ని కులాల వారు ఒకే చోట కూర్చుని భోజనం చేసే సంప్రదాయాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. దేశమంతా లింగాయత ధర్మ వ్యాప్తి కోసం కృషి చేశారన్నారు. పూజారి సాంబయ్య, అధ్యాపకులు మల్లికార్జున మాట్లాడారు. అనంతరం వీరశైవ సంఘం నాయకులు జిల్లా కలెక్టర్‌ను సన్మానించి జ్ఞాపికను అందించారు.

వృద్ధ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



సబ్‌జైల్‌లో ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి

నంద్యాల(వ్యవసాయం): వృద్ధ(70 ఏళ్లు వయస్సుపై బడిన) ఖైదీలకు, అనారోగ్యంతో బాధపడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఉమ్మడి కర్నూలు జిల్లా న్యాయ సేవాధి కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని చెప్పారు. నంద్యాల స్పెషల్ సబ్ జైలును బుధవారం ఆయన తనిఖీ చేశారు. జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ గురించి తెలియజేశారు. ప్రిజన్ లీగల్ ఎయిడ్‌లో ఒక అడ్వకేట్, ఒక పారా లీగల్ వలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఖైదీలకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా నియమిస్తామని అన్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100పై ఖైదీలకు తెలియజేశారు . జైల్ సూపరింటెండెంట్ గురుప్రసాద్ రెడ్డి, జిల్లా జైళ్ల అధికారి నరసింహారెడ్డి, జైల్ డాక్టర్ గురుకుమార్, లాయర్ బాలు నాయక్, శేషసాయి పాల్గొన్నారు.

నమో.. నారసింహా!

- శాస్త్రోక్తంగా సెల్వర్ కుత్తు ఉత్సవం





పల్లకీలో స్వామి వారిని తీసుకొస్తున్న దృశ్యం, ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తి శ్రీ జ్వాలా నరసింహుడు

ఆళ్లగడ్డ: శ్రీ నృసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఎగువ అహోబిలంలో సెల్వార్ కుత్తు ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి జయంతి బ్రహ్మోత్సవాలు మే నెల 2 నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం ఉదయం నిత్య పూజల అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తి శ్రీ జ్వాలా నరసింహస్వామిని ఉత్సవ పల్లకీలో కొలువుంచి దేవాలయం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం వద్దకు తీసుకు వచ్చారు. పండితులు వేద మంత్రోచ్ఛారణలతో సెల్వర్ కుత్తు ఉత్సవం నిర్వహించారు. పూజల్లో ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాలన్, మణియార్ సొమ్యానారాయణ్, మేనేజర్ మాధవన్ పాల్గొన్నారు. శ్రీ అహోబిలేశుడి జయంతి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం అంకురార్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

వీఓఏ ఆత్మహత్య

బేతంచెర్ల: బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన వీఓఏ జింక సుధాకర్(40) బుధవారం ఉదయం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య రజని, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుమారు 20 సంవత్సరాలకు పైగా వీఓఏగా పనిచేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న వెలుగు ఏపీఎం మధు సూధన్ గౌడు, మెప్మా సిబ్బంది గ్రామానికి చేరుకుని వీఓఏ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. సుధాకర్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

స్కూల్ యూనిఫామ్ పరిశీలన



యూనిఫామ్‌ను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష జిల్లా ఆకోర్డినేటర్

బేతంచెర్ల: పట్టణంలోని సాయి ధరణిలో ఉన్న జెడ్పీ హైస్కూల్లో మండలంలోని విద్యార్థులకు మంజూరైన యూనిఫామ్‌ను సమగ్ర శిక్ష జిల్లా ఆకోర్డినేటర్ ప్రేమంత్ కుమార్ బుధవారం పరిశీలించారు. మగ పిల్లలకు, ఆడ పిల్లలకు ఒక్కొక్కరికి 3 జతల చొప్పున్న యూనిఫామ్ ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. విద్యార్థులకు ఇస్తున్న నోట్ పుస్తకాలను నాణ్యతగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఏఎం లలిత, ఎంఈఓ సోమశేఖర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు: కల్లూరు మండలం ముజఫర్ నగర్ శివారులోని అయ్యప్పస్వామి నగర్ వద్ద ఉన్న లెదర్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న మురికి గుంతలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. లెదర్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వృథా నీరు సమీపంలో నిల్వ ఉండి కుంటగా మారింది. అందులో గుర్తు తెలియని వ్యక్తి పడి మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటుంది. నీటిలో మునిగిపోవడం వల్ల ముఖమంతా ఉబ్బి పోయి గుర్తు పట్టనివిధంగా ఉంది. ఆచూకీ తెలిసిన వారు 9121101062కు సమాచారం ఇవ్వాలని నాల్గవ పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్ తెలిపారు.

అధికారులు ఈ వంక చూడరు?

- యథేచ్ఛగా వాగులు, వంకలు కబ్జా చేస్తున్న కూటమి నేతలు
- వంక పోరంబోకు స్థలంలో షెడ్లకు ఇంటి నంబర్ల కేటాయింపు



ఆక్రమిత షెడ్డుకు ఇంటినంబర్ కేటాయించిన మున్సిపల్ అధికారులు





బోగందాని వంక పక్కన వెలసిన రేకుల షెడ్డు, ఐటీఐ కళాశాలకు ఎదురుగా వంకను పూడ్చివేసేందుకు వేస్టేజీని కుప్పలుగా పోసిన దృశ్యం

డోన్: ఖాళీ జాగా కనిపిస్తే చాలు కూటమి నేతలు పాగా వేస్తేన్నారు. వాగులు, వంకలను సైతం వదలడం లేదు. రాత్రిరాత్రికి ఆక్రమణకు గురవుతున్నా అధికారులు అటు వైపు కన్నెతి చూడటం లేదు. అంతేకాకుండా కొందరు అధికారులు ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్నారు. కూటమి నేతల ఆక్రమణలకు చెరువులు సైతం ఒట్టిపోయే ప్రమాదం పొంచి ఉంది. డోన్ పట్టణ నడిబొడ్డున ఉన్న బోగందాని వంక.. కొచ్చెర్వు చెరువు, వెంకటాపురం, ఉడుములపాడు, జగదుర్తి చెరువులకు సమృద్ధిగా నీరందించేది. ఈ వంకను పూడ్చేందుకు కొందరు టీడీపీ నాయకులు పూడ్చివేస్తున్నారు. మరోవైపు వంకను ఆనుకొని ఓ టీడీపీ కార్యకర్త రేకులషెడ్డును నిర్మించి నిబంధనలకు విరుద్ధగా మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్‌ను పొందడం జరిగింది. ఈ ప్రాంతంలో సెంటు స్థలం రూ.10 లక్షల ధర పలుకుతుండటంతో టౌన్ ప్లానింగ్ అధికారులతో కుమ్మక్కై ఇంటి నంబర్ పొందేందుకు పలువురు నేతలు పావులు కదుపుతున్నారు. దీంతో వంక నానాటికి ఆక్రమణతో కుశించికుపోయి నీటి ప్రవాహం నిలిచిపోయి చెరువులకు నీరందని పరిస్థితి ఏర్పడుతుంది. వెంటనే మైనర్ ఇరిగేషన్ అధికారులు ఈ వంక వెంట వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. లేకపోతే లోతట్టు కాలనీలు జలమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.



సువిశాలంగా ఉన్న వంక

ఆక్రమణలతో కుచించుక పోయిన దృశ్యం

శ్రీశైలంలో భారీ వర్షం



భారీ వర్షం కురుస్తున్న దృశ్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహా క్షేత్రంలో బుధవారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీగా ఈదురు గాలులు వీచాయి. వడగండ్ల వాన కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులకు క్షేత్రంలో పలు చోట్ల వక్షాలు నేలకొరిగాయి. భారీ వర్షాలకు సాంకేతిక లోపంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు ఎంత శ్రమించినప్పటికీ రాత్రి వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదు. మల్లన్న దర్శనానికి వచ్చిన భక్తులు విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు పడ్డారు.

ప్రియుడి ఇంటి ముందు ట్రాన్స్‌జెండర్ ధర్నా



మాట్లాడుతున్న హాసినిగౌడ్

ఆదోని రూరల్: తనను మోసం చేశాడంటూ ఆదోని మండలం బైచిగేరికి చెందిన యువకుడి ఇంటి ఎదుట ఓ ట్రాన్స్‌జెండర్ ఆందోళనకు దిగింది. బాధితురాలి కథనం మేరకు.. నాలుగేళ్ల క్రితం ఆదోని మండలం బైచిగేరికి చెందిన గణేష్ అనే యువకుడు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ అన్నమయ్య జిల్లా మదనపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు హాసినిగౌడ్ ఊరఫ్ రామకృష్ణ(24) అనే ట్రాన్స్‌జెండర్‌తో పరిచయం ఏర్పడి, సహజీవనం చేస్తూ వచ్చాడు. గతేడాది గణేష్‌కు పెళ్లి కుదరడంతో ట్రాన్స్‌జెండర్ హాసినిని వదిలేసి సొంత గ్రామానికి రావడంతో 2024 జూన్ 10న బైచిగేరి గ్రామానికి వచ్చి తనకు న్యాయం చేయాలని హాసినిగౌడ్ నిరసన తెలిపింది. ఆదోని తాలూకా పోలీసులు ఆమె నివాసముంటున్న హైదరాబాద్‌లోని సైబరాబాద్ కమిషనరేట్ సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ మేరకు హాసినిగౌడ్ అక్కడ ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయితే మరలా బుధవారం వచ్చి బైచిగేరిలో గణేష్ ఇంటి ముందు ధర్నాకు దిగింది. "నువ్వే నా ప్రాణం, నా సర్వస్వం.. నువ్వు లేనిదే నేను లేనంటూ నా వెంట పడ్డాడు. నేను ఒక ట్రాన్స్‌జెండర్. నాతో నీవు సావాసం చేస్తే ఎలాంటి ఉపయోగం ఉండదని చెప్పాను. అయినా వినకుండా, తననే పెళ్లి చేసుకుంటాని వెంట బడ్డాడు. నాకు పిల్లలు పుట్టరని చెప్పినప్పటికీ వినిపించుకోలేదు. మా ఇంటి నుంచి రూ.5 లక్షలు తీసుకెళ్లి ఇద్దరం పెళ్లి చేసుకుని హైదరాబాద్‌లో నివాసముంటున్నామని హాసినిగౌడ్ వాపోయింది. తన డబ్బులు రూ.5 లక్షలు అయినా ఇప్పించాలని, లేకపోతే గణేష్‌తో కాపురం అయినా చేయించాలని డిమాండ్ చేసింది. సమాచారం అందుకున్న తాలూకా ఎస్ఐ రామాంజనేయులు గ్రామానికి చేరుకుని విచారించారు. హాసినిగౌడ్ గణేష్‌పై ఇదివరకే కేసు హైదరాబాద్‌లో నమోదయ్యిందని, ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి న్యాయం చేస్తామని ఎస్ఐ చెప్పడంతో వారు హాసినిగౌడ్, ఇతర ట్రాన్స్‌జెండర్లు ధర్నా విరమించారు.



కూటి కోసం పాము చేత పట్టి

కూటి కోసం కోటి విద్యలన్నారు పెద్దలు. కడుపు నింపుకోవడానికి వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన వెంకటమ్మ అనే మహిళ కొండచిలువను మెడలో వేసుకుని భిక్షాటన చేస్తోంది. మండలంలోని పల్లెల్లో భిక్షాటన చేస్తూ కనిపించిన మహిళ పలు ఆసక్తికర విషయాలు చెప్పింది. గొంతుకు చుట్టుకుంటే ప్రాణానికే ప్రమాదం కదా అని ప్రశ్నిస్తే ప్రస్తుతం భిక్షాటన చేయాలంటే ఏదో ఒక కొత్తదనం ఉంటే తప్పా పైసలు ఇవ్వడం లేదని చెబుతోంది. పాముకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు, కప్పలు, ఎలుకలను వేస్తానని, కొండచిలువను చూసేందుకు వచ్చి ఒకొక్కరు రూ.10, రూ.5 ఇస్తున్నారని కోటివిద్యల్లో ఇదోకటి అంటూ నవ్వుతూ చెబుతోంది.

– దొర్నిపాడు

సెంటిమెంట్ పండింది

- అక్షయ తృతీయ రోజున బంగారం కొనుగోళ్లకు పోటెత్తిన జనాలు
- ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.250 కోట్ల మేర అమ్మకాలు?
- వివాహాలు ఉండటంతో పెరిగిన కొనుగోళ్లు



కర్నూలులోని బంగారం దుకాణంలో కొనుగోలుదారులు

కర్నూలు(అగ్రికల్చర్): సెంటిమెంటు పండింది. అక్షయ తృతీయను పురస్కరించుకుని బుధవారం బంగారం కొనుగోలు చేసేందుకు వినియోగదారులకు దుకాణాలకు పోటెత్తారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ తదితర పట్టణాల్లో కొనుగోలుదారులతో బంగారం దుకాణాలు కిటకిటలాడాయి. ఉదయం 9 గంటలకే బంగారం దుకాణాలు తెరుచుకున్నాయి. రాత్రి ప్రొద్దుపోయే వరకు జనాల రద్దీ తగ్గలేదు. ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా మొత్తం మీద దాదాపు రూ.250 కోట్ల వ్యాపారం జరిగి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కార్పొరేట్ జ్యువెలరీ సంస్థలు 10 రోజులుగా ఆఫర్ల గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నాయి. గత ఏడాది అక్షయ తృతీయ రోజున 10 గ్రాముల బంగారం ధర రూ.73,240గా ఉంది. ఈ అక్షయ తృతీయ నాటికి 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,800, 24 క్యారెట్ల ధర రూ.97,960కి చేరాయి. ఈ ధరపై తరుగు పేరుతో డిజైన్ బట్టి 6 నుంచి 22 శాతం సొమ్ము అదనంగా రాబట్టినట్లు స్పష్టమవుతోంది. మే నెలలో వివాహాది శుభకార్యాలు ఉండటంతో అక్షయ తృతీయ అమ్మకాలు జోరుగా జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ అక్షయ తృతీయ రోజున బంగారం కొనుగోళ్లు పెరిగినట్లు తెలుస్తోంది. ఈ రోజున బంగారం కొనుగోలు చేస్తే లక్ష్మీదేవిని ఇంటిలోకి ఆహ్వానించినట్లే అన్న సెంటిమెంటు కూడా బాగా కనిపించింది. కార్పొరేట్ బంగారం దుకాణ సంస్థలు అక్షయ తృతీయ ఆఫర్ల పేరుతో పెద్ద ఎత్తున చేసుకున్న ప్రచారం గ్రామీణ ప్రాంతాల ప్రజల్లోకి కూడా వెళ్లడంతో కొనుగోళ్లు కొంత పెరిగినట్లు తెలుస్తోంది.

విద్యుదాఘాతంతో విద్యార్థిని మృతి

బొమ్మలసత్రం: పట్టణంలోని ఓ కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థిని నేత్ర(24) విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. టూటౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లికిచెందిన నేత్ర గత కొంత కాలంగా పట్టణంలోని ఓ బ్యాంక్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటుంది. అయితే సమీపంలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటుంది. హాస్టల్‌కు సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లపై ప్రమాదవశాత్తు చేయి తగిలి అక్కడికక్కడే కుప్పకూలింది. హాస్టల్ నిర్వాహకులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే నేత్ర ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమె కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక 26వ తేదీ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థిని మృతి చెందినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

కుక్కను తప్పించబోయి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పరుశురాముడు

కర్నూలు: కర్నూలు బళ్లారి చౌరస్తా సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వెనుక జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం తరిగోపుల గ్రామానికి చెందిన మండ్ల పరుశురాముడు (26) కర్నూలు నగరంలోని సాయికృష్ణ డిగ్రీ కళాశాల సమీపంలో నివాసముంటాడు. బుధవారం తెల్లవారుజామున హైదరాబాదు వైపు నుంచి కర్నూలులోకి వచ్చే సర్వీసు రోడ్డులో ఆంజనేయస్వామి గుడి వెనుక రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. బైక్‌పై స్నేహితుడు ఎల్లా నాయుడుతో కలసి వస్తూ ఆంజనేయస్వామి గుడి వద్ద అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి అదుపు తప్పి కింద పడ్డాడు. బైక్ నడుపుతున్న పరుశురాముడు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. వెనుక కూర్చున్న ఎల్లా నాయుడుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరుశురాముడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు జీవాలు మృతి



మృతిచెందిన జీవాలు

అవుకు: చెన్నంపల్లి గ్రామంలో బుధవారం పిడుగుపాటుకు నాలుగు జీవాలు మృతి చెందాయి. బాధితులు తెలిపిన మేరకు.. సింగన పల్లె గ్రామానికి చెందిన కొత్తపేట ప్రసాదు తన భార్య నాగలక్ష్మితో కలిసి జీవాలను చెన్నంపల్లె గ్రామ సమీపంలో జీవాలను మేపుతుండగా ఉరుములతో నాలుగు జీవాలు మృతి చెందాయని తెలిపారు.

కల్వర్టును ఢీకొన్న లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

కోడుమూరు రూరల్: ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి లారీ అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్న సంఘటన బుధవారం కోడుమూరు నుంచి కర్నూలు వెళ్లే రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలు.. డోన్ నుంచి ఆదోని వైపు వెళుతున్న లారీ ప్యాలకుర్తి సమీపాన ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో రోడ్డు సైడ్‌కు ఉన్న కల్వర్టును వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ చక్రాలన్నీ ఊడిపోవడంతో పాటు, లారీ డ్రైవర్, క్లీనర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద పరిస్థితి చూస్తే ఘోర ప్రమాదం నుంచి బయటపడినట్లుగా ఉంది. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎస్ఐ ఎర్రిస్వామి ప్రమాద స్థలాన్ని చేరుకుని పరిస్థితి సమీక్షించి రోడ్డుపై వెళ్లే వాహనాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.



లారీ టైర్లు విరిగి రోడ్డుపై పడిన దృశ్యం

బంగారు దుకాణంలో చోరీ





పత్తికొండలోని బంగారు దుకాణంలో ఖాళీగా ఉన్న పెట్టెలు,దుండగులు పగులగొట్టిన పైకప్పు

పత్తికొండ రూరల్: పత్తికొండ-గుత్తి రోడ్డు కూడలిలో మెయిన్ రోడ్డులో ఉన్న బంగారు దుకాణంలో చోరీ జరిగింది. దూదేకొండ గ్రామానికి చెందిన పింజరి అక్బర్ సాహెబ్ గత 13 ఏళ్లుగా పత్తికొండ పట్టణంలో బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. వెండి, బంగారు ఆభరణాలు తయారు చేస్తూ విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి షాపునకు తాళం వేసి సొంతూరుకు వెళ్లాడు. బుధవారం ఉదయం షాప తెరిచి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు పైకప్పు తొలగించి చోరీకి పాల్పడినట్లు గుర్తించాడు. షాపులోని లాకర్‌లో ఉంచుకున్న 8 జతల బంగారు కమ్మలు, ఒక టిన్నర కేజీల వెండి ఆభరణాలతో పాటు రూ.3 లక్షల నగదును అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దుకాణాన్ని స్థలాన్ని పరిశీలించి, వేలిముద్రలు సేకరించినట్లు సీఐ జయన్న తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కుందూనదిలో మునిగి యువకుడి మృతి



మృతి చెందిన జయవర్ధన్

కోవెలకుంట్ల: రేవనూరుకు చెందిన ఓ యువకుడు గొర్రెలు మేపుకునేందుకు వెళ్లి బుధవారం ప్రమాదశాత్తు కుందూనదిలో మునిగి మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన బాలుడు, లక్ష్మీదేవి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు జయవర్ధన్(20) పదవ తరగతి వరకు విద్యనభ్యసించి మధ్యలో చదువు మానేశాడు. గొర్రెల కాపరిగా ఉంటూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఉదయం మరో ఇద్దరు యువకులతో కలిసి గొర్రెలు మేపుకునేందుకు రేవనూరు- కలుగొట్ల గ్రామాల మధ్య ప్రవహిస్తున్న కుందూనది వైపు వెళ్లారు. నది ఆవతలి ఒడ్డుకు గొర్రెలను తోలుకపోయే క్రమంలో ముగ్గురు నదిలో దిగారు. జయవర్ధన్ లోతు ఎక్కువ ఉన్న వైపు వెళ్లి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. మిగిలిన యువకులు పెద్దగా కేకలు వేయడంతో పక్క పొలాల్లో ఉన్న రైతులు నదిలో దిగి గాలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు రేవనూరు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, బైక్‌ను చూపుతున్న ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి, సిబ్బంది

డోన్ రూరల్: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం సీఐ వరలక్ష్మి కేసు వివరాలను వెల్లడించారు. అందిన సమాచారం మేరకు కొచ్చెర్వు గ్రామంలో దాడి చేయగా గ్రామానికి చెందిన మేకల లక్ష్మన్న, వడ్డే శ్రీనివాసులు అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి 192 కర్ణాటక మద్యం సీసాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. సమావేశంలో ఎస్ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, సుధాకర్‌రెడ్డి, గోపాల్, భాషీర్, ఉమాకాంత్‌రెడ్డి, చెన్నకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీరుసీసాతో దాడి

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని వైన్‌షాపు వద్ద ఉన్న ఓ దుకాణంలో బుధవారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. అబ్బీపురం గ్రామానికి చెందిన యువకుడు దుకాణంలో వస్తువులు కొనుగోలు చేసి రూ.30 ఫోన్ పే చేశాడు. అయితే ఓ నంబరుకు పంపించబోయి మరో నెంబరుకు పంపించాడు. దీంతో తనకు డబ్బు రాలేదని దుకాణం యజమాని చెప్పడంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. కోపోద్రిక్తుడైన యువకుడు బీరుసీసాతో దుకాణం యజమానిపై దాడి చేయడంతో స్వల్పగాయమైనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేస్తున్నారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేని పోలీసులు తెలిపారు.

గిర గిర తిరగాలి బొంగరం..!



పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు ఆటపాటల్లో మునిగి తేలుతున్నారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఆటల్లో బిజీ అయ్యారు. మారుతున్న కాలానుగుణంగా సెల్‌ఫోన్లకు బానిస కాకుండా పిల్లలను వారి తల్లిదండ్రులు పాతకాలంనాటి ఆటల వైపు దృష్టి మళ్లిస్తున్నారు. ఖోఖో, కబడ్డీ, క్యారమ్స్, బిల్లంగోడు, బొంగరాలు, తదితర ఆటలపై పిల్లలు ఆసక్తి కనబరుస్తున్నారు. కోవెలకుంట్ల పట్టణంలో నాగుల కట్ట సమీపంలో కొందరు పిల్లలు బొంగరాల ఆట ఆడుతూ కనిపించారు.

– కోవెలకుంట్ల